


సిద్ధిపేటలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన సింగర్ లక్ష్మమ్మ, ఆమె బృందాన్ని అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ప్రతాని రామకృష్ణగౌడ్ తదితరులు

హైదరాబాద్‌కు వస్తూ సిద్ధిపేట శివారులోని ఓ దాబాలో చాయ్ తాగుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

# సిద్ధిపేట ఓ ఎమోషన్..

## గులాబీల జెండలే..

### సభ ఉర్రూతలూగెలే

- 'రామక్క' పాటతో పరవశించిపోయిన సిద్ధిపేట ప్రజా ఆశీర్వాద సభ
- సింగర్ కొమ్ము లక్ష్మమ్మకు సీఎం కేసీఆర్ అభినందన

సిద్ధిపేట ప్రతినిధి, అక్టోబర్ 17 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'గులాబీల జెండలే రామక్క' పాటతో సిద్ధిపేట ప్రజా ఆశీర్వాద సభ ఊర్రూతలూగింది. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఇటీవల వచ్చిన 'గులాబీల జెండలే రామక్క' పాటను సింగర్ లక్ష్మమ్మ పాడడంతో సభా ప్రాంగణం మొత్తం ఊగిపోయింది. ఇదే పాటను సిద్ధిపేట అభివృద్ధికి అన్వయించి పాడగా మంత్రి హరీశ్‌రావు తోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో ఆడిపాడారు. రామక్క పాట బృందాన్ని సీఎం కేసీఆర్ అభినందించారు.

**ఏ నోట విన్నా ఈ పాటే**

తెలంగాణలో నేడు ఏ నోట విన్నా 'గులాబీల జెండలే రామక్క' పాటనే వినిపిస్తున్నది. అందరూ 'నడువు నడవే రామక్కా... కలిసి నడుము కట్టవే రామక్కా... గులాబీల జెండలమ్మ' అని పాడుతూ స్టెప్పులేస్తున్నారు. ఈ పాటను జానపద కళాకారిణి కొమ్ము లక్ష్మమ్మ ఆలపించారు. కల్యాణ్ కీస్ సంగీతాన్ని సమకూర్చగా.. బీఆర్ఎస్ పార్టీ ఈ పాటను ఇటీవల విడుదల చేసింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్నది. సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించిన తీరు.. అభివృద్ధి, సంక్షేమానికి పదేండ్లలో చేసిన కృషిని పల్లెపదాల్లో వివరిస్తూ.. కారు గుర్తును గుర్తుంచుకో అని లక్ష్మమ్మ పాడిన పాటకు జనాలనుంచి భారీ స్పందన వస్తున్నది. తెలంగాణ ఆడబిడ్డలు కూడా ఈ పాటపై బతుకమ్మ ఆడుతూ ఆనందంగా పాదం కలుపుతున్నారు.

మొదటిపేజీ తరువాయి...

వచ్చిన అశేష జనవాహినిని, లెక్కించడానికి వీలుకానంత సంఖ్యలో వచ్చిన ప్రజలను చూసి సంతోషిస్తున్నా' అని కేసీఆర్ అన్నారు. సిద్ధిపేటలో కాలుమోపిన సందర్భంగా 'జననీ జన్మ భూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసీ' అంటూ శ్రీరామచంద్రుడు చెప్పిన సూక్తిని వివరిస్తూ.. సిద్ధిపేటతో తనకున్న ఆత్మీయ అనుబంధాలను నెమరేసుకున్నారు. 'సిద్ధిపేట గడ్డ నన్ను సాదింది. పెద్దగజేసింది. చదువుజెప్పింది. నాకు రాజకీయ జన్మనిచ్చింది. నన్ను రాజకీయ నాయకుడిని చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యేంత ఎత్తుకు పెంచిన గడ్డ సిద్ధిపేట' అని గర్వంగా చెప్పుకొన్నారు.

**ఇక్కడి కష్టాలు చూసే మిషన్ భగీరథ**

రంగనాయక్‌సాగర్‌నుంచి సిద్ధిపేటకు నీళ్లిచ్చి కరువును పారదోలే క్రమంలో.. సిద్ధిపేటను ఈ స్థాయికి తీసుకొచ్చిన వేళ.. నాడు ఎన్నో కష్టాలు అనుభవించినట్టు సీఎం కేసీఆర్ చెప్పారు. నాడు సిద్ధిపేట పట్టణంలో మంచినీళ్ల కరువొస్తే.. 28 వార్డుల్లో వార్డుకొక ట్యాంకర్ పెట్టించినట్టు తెలిపారు. నాలుగు బోర్లు వేసే వాహనాలను తీసుకెళ్లి వంద బోర్లు వేస్తే.. వాటిలో రెండింటిలో ఎక్కడో నీటి తేమ వచ్చిన దాఖలాలను గుర్తు చేసుకొన్నారు. ఆ వెతలను చూసి ఆనాడే లోయర్ మానేర్ డ్యాం నుంచి నీళ్లు తెచ్చుకొని..జలజాతర చేసుకున్నట్టు చెప్పారు. ఈరోజు తెంగాణ మొత్తం మిషన్ భగీరథ అమలవుతున్నదంటే.. సిద్ధిపేట మంచినీళ్ల పథకమే దానికి ఆదర్శమని చెప్పారు.

**ఉద్యమస్ఫూర్తి రగిలించింది ఈ గడ్డే**

నాడు సిద్ధిపేటతోసహా తెలంగాణలో ప్రజలు పడుతున్న వెతలను చూసి అధికార పార్టీని వదిలిపెట్టినట్టు కేసీఆర్ చెప్పారు. అదే ఊపులో అందరినీ వెంటేసుకొని వెళ్లి పోరాడి.. మొండి పట్టుదల, ధైర్యంతో ప్రాణాలకు కూడా తెగించి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఆ వెంటనే వచ్చిన ఉప ఎన్నికల్లో సమైక్యవాదులంతా వచ్చి తనకు వ్యతిరేకంగా లక్షల రూపాయలు ఖర్చుపెట్టినా.. తనకు కేటాయించిన బస్సు గుర్తుకే ఓట్లు వేసి, 60 వేల మెజార్టీతో సిద్ధిపేట ప్రజలు తనను గెలిపించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం విజయం సాధించడానికి పునాది వేసింది కూడా సిద్ధిపేట గడ్డే అని తెలిపారు. ఆ రోజులను ఏనాడు తాను మర్చిపోలేనంటూ సగర్వంగా చెప్పారు.

> తెలంగాణను ఈ రోజు యావత్తు దేశం ఆదర్శంగా తీసుకునేలా, అబ్బురపడేలా అనేక రంగాల్లో అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్తున్నానంటే కారణం సిద్ధిపేట గడ్డ నుంచి నాకు దొరికిన రక్తం, మాంసం, బుద్ధి, బలం.. అన్నీ ఈ గడ్డ పుణ్యమే.
>
> -సీఎం కేసీఆర్

**నేను హరీశ్‌లా పనిచేయలేనేమో**

తాను కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తాను లేని లోటును తీర్చేందుకు ఆరడుగుల బుల్లెట్టు హరీశ్‌ను ప్రజలకు అప్పగిస్తే.. తాను ఊహించిన దానికంటే ఎక్కువ మెజార్టీ ఇచ్చి గెలిపించారని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. హరీశ్‌రావు కూడా బ్రహ్మాండంగా మంచిపనులు చేసి తన మాటను నిలబెట్టి, ప్రజల గౌరవాన్ని కాపాడారని అభినందించారు. 'హరీశ్‌రావు అటూ ఇటూ తిరుగుతడు. ఏడన్న తట్టెడు పెండ కనిపిస్తే కొంచబోయి సిద్ధిపేటలో ఏసుకుంటడు' అని ఎమ్మెల్యేలు, మంత్రుల్లో హరీశ్‌రావుపై ఓ జోకుందని తెలిపారు. తెలంగాణను సాధించటమే కాదు.. మన సిద్ధిపేట ప్రజల కలలను సాకారం చేసి, ఈ పురిటి గడ్డ రుణం తీర్చుకున్న సిద్ధిపేట మట్టి బిడ్డ మన కేసీఆర్ అని కొనియాడారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ 'ఇది ఎన్నికల ప్రచార సభలా లేదు. మన కలలను సాకారం చేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేసే సభలా ఉన్నది. సీఎం కేసీఆర్‌కు మరింత శక్తినిచ్చి, దీవెనలిచ్చి, మరింత ఊపునిచ్చే సభలా ఉన్నది. మన సిద్ధిపేటకు ట్యాగ్‌లైన్ ఉండేది. నాటి నినాదాలు సిద్ధిపేట జిల్లా, నీళ్లు, రైలు ఇవి తక్కువ ఉన్నదని, అది గాలిమోటర్ రావడమేనని అన్నారు. స్వరాష్ట్రంలో సిద్ధిపేటకు అధికారం వచ్చిందని, గౌరవం వచ్చిందని, మెడికల్ కళాశాల వచ్చిందని, మినీ యూనివర్సిటీ కూడా రానున్నదని, ఇంజినీరింగ్ కాలేజీలతో పాటు అనేక ఇన్‌స్టిట్యూట్లు వస్తున్నాయని, హరీశ్‌రావు పట్టుబట్టి ఐటీ హబ్‌ను తీసుకొచ్చారని వివరించారు. జిల్లా చేసుకొన్న తర్వాత అన్ని బాధలు పోయాయని, గొప్ప వర్తక, వాణిజ్య, వ్యాపార, ఐటీ, కాలుష్యంలేని పరిశ్రమల కేంద్రంగా, ధాన్యం పడించే వ్యవసాయ క్షేత్రంగా సిద్ధిపేట ఎదగడం చాలా ఆనందంగా ఉన్నదని అన్నారు. రాబోయేరోజుల్లో చాలా అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.

సింగర్ లక్ష్మమ్మ పాటకు ఉత్సాహంగా చప్పట్లు కొడుతున్న మంత్రి హరీశ్‌రావు.. సభా ప్రాంగణంలో కేరింతలు కొడుతూ చిందులేస్తున్న యువకులు

> సిద్ధిపేటకు రానిది ఏంది? లేనిది ఏంది? గోదావరి జలాలు వచ్చినయ్. రైలు వచ్చింది. ఎండాకాలంలో చెక్‌డ్యామ్‌లు, చెరువులు మత్తళ్లు దుంకుతున్నయి. ఒక నాడు తెలంగాణలో కన్నీరు కార్చిన సిద్ధిపేటలో నేడు చెక్‌డ్యాములన్నీ పన్నీరు కారినట్టుగా మత్తళ్లు దుంకుతున్నయి. ఆ ఫొటోలు చూసుకుంటూ నేను హైదరాబాద్‌లో సంతోషపడుతున్నా.
>
> -సీఎం కేసీఆర్

చమత్కరించారు. మంత్రి అయినప్పటి నుంచి ఇప్పటివరకూ ప్రతి ఒక్క విషయంలో, ప్రతి కార్యక్రమాన్ని సిద్ధిపేటకు తీసుకొచ్చేందుకు అద్భుతమైన కృషి చేస్తున్నాడని, తాను సిద్ధిపేట ఎమ్మెల్యేనైనా ఆ స్థాయిలో పనిచేసేటోడిని కాదేమోనని అన్నారు. 'ఎప్పుడు హెలికాప్టర్‌లో ఆ హుస్నాబాద్ పోయినా.. ఏడికి పోయినా నంగునూర్ పెద్దవాగు మీద చెక్‌డ్యామ్‌లను చూసి బ్రహ్మాండంగా మనసు పులకించిపోతున్నది. మొన్నటికి మొన్న హుస్నాబాద్ పోతున్నప్పుడు కూడా చూపెట్టిన. ఇప్పుడు కూడా నిండుకుండల్లా ఉన్నాయి.' అని ఆనందం వ్యక్తం చేశారు. సిద్ధిపేటకు ఒక్కటే ఒక్కటి

**రికార్డు తిరగరాయాలె**

సిద్ధిపేట ప్రజలకు కొత్తగా చెప్పాల్సిందేమీ లేదని, హరీశ్‌రావు విజయంపై తనకు ఎలాంటి అనుమానం లేదని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హరీశ్‌రావుకు లక్ష మెజార్టీ ఇచ్చి బ్రహ్మాండమైన రికార్డు నెలకొల్పారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ రికార్డును సిద్ధిపేట ప్రజలే మళ్లీ తిరగరాయాలని, హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**సిద్ధిపేట అనుభవాలే ఎన్నో పథకాలకు ప్రేరణ**

ఇవాళ తెలంగాణ రాష్ట్రం దేశానికి తలమానికమైతే.. సిద్ధిపేట నియోజకవర్గం యావత్తు తెలంగాణకే తలమానికంగా నిలుస్తుంది' అని కేసీఆర్ పేర్కొన్నారు. సిద్ధిపేట అనుభవాలే ఎన్నో పథకాలకు ప్రేరణగా నిలిచాయని చెప్పారు. బీసీల్లో ఉండే విశ్వబ్రాహ్మణులు, రజకులు, నాయీబ్రాహ్మణుల కోసం కరెంటు ఫ్రీగా ఇచ్చామని, ఇటీవలే మాడ్రన్ సెలూన్లు, అధునాత వృత్తి పనిముట్లు కొనుగోలు కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామని వెల్లడించారు. అది కూడా నిరంతర ప్రక్రియ అని, ప్రతి బీసీ బిడ్డకు అందుతుందని అన్నారు.

**నాకు డిపాజిట్ కట్టే తోర్నాల చంద్రారెడ్డి బావ ఎక్కడున్నడో!**

తనను ఇంతవాడిని చేసిన తన మాతృభూమికి, కన్నతల్లికి నిండుసభ సాక్షిగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్టు కేసీఆర్ చెప్పారు. తనను ప్రతి సందర్భంలో విజేతగా నిలబెట్టిన సిద్ధిపేట గడ్డ రుణం ఈ జన్మలో ఏమిచ్చినా తీర్చుకోలేనిదంటూ భావోద్వేగంతో చెప్పారు. సిద్ధిపేట సభలో తనతో కలిసి పనిచేసిన మిత్రులు, సహచరులు, ఆత్మీయ మిత్రులు వందలాది మంది ఉన్నారని తెలిపారు. వారితో అనేక జ్ఞాపకాలు ఉన్నాయని చెప్పారు. కొండమరాజుపల్లి మాదన్న ఎక్కడున్నడో.. నవాబ్‌సాబ్ ఎక్కడున్నడో, తనకు డిపాజిట్ కట్టే తోర్నాల చంద్రారెడ్డి బావ ఎక్కడున్నడో.. ఇలా ప్రతి గ్రామంలో వంద నుంచి 150 మంది వరకు ఆత్మీయులు ఉన్నారంటూ నాటి స్మృతులను గుర్తు చేసుకొన్నారు. తన ఆత్మీయులను పేరుపేరునా తలచుకొన్నారు.

### దళితబంధుకు ప్రేరణ సిద్ధిపేటే

*దళితబంధు పథకానికి ప్రేరణ కూడా సిద్ధిపేటలోని రామంచకు చెందిన దళిత ఆడబిడ్డే. సిద్ధిపేటలో ఉన్న సమయంలో ఓ దళిత ఆడబిడ్డ వచ్చి బిడ్డ పెండ్లి ఎత్తిపోయేట్టున్నదని ఎంతో బాధపడింది. కారణమేంటని అడిగిన. అల్లుడికి సైకిల్ పెడతా అని ఒప్పుకున్నా.. పైసలు ఎత్తలేవని చెప్పింది. నేనే రూ.1900 పెట్టి సైకిల్ కొనిచ్చా. అదీ దేశంలోని దళితుల పరిస్థితి. అలాంటి ఎన్నో సంఘటనలు నా అనుభవంలో ఉన్నాయి. అయినా దిక్కుమాలిన కాంగ్రెస్ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వాళ్ల కోసం ఏ పనీ చేయలేదు. ఆ నేపథ్యంలోనే ఒక మంచి కార్యక్రమం తీసుకోవాలనే ఉద్దేశంతో సిద్ధిపేట అనుభవాలనే గుణపాఠాలుగా తీసుకుని దళితబంధుకు శ్రీకారం చుట్టాం. తెలంగాణ దళిత సమాజం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏటా 50 వేల కుటుంబాలకో, లక్ష కుటుంబాలకో దళితబంధును తప్పక ఇస్తాం.*

### ముదిరాజు తల్లి చనుబాలిచ్చి సాదింది

*'చింతమడకలో ఉన్నప్పుడు.. పనికూనగా అమ్మ చనుబాలు తాగే సమయంలో నా కన్నతల్లికి ఆరోగ్యం దెబ్బతిన్నది. మా ఊర్లోని ఒక ముదిరాజు తల్లి నాకు చనుబాలిచ్చి సాదింది. అంతటి అనుబంధం ఈ సిద్ధిపేట గడ్డతోటి ఉంది' అని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సిద్ధిపేటలో తాను పాదయాత్ర చేయని గ్రామం లేదని, చూడని కుంటలు, చెరువులు లేవని పేర్కొన్నారు. 'కట్ల మాల్యాలకు పోయి శిల్కమారోని కుంట' ఏమైంది? అని అడిగేదని, ఏ ఊరికిపోయినా సర్పంచులు ఆదరించారని చెప్పారు. నాడు మంచినీళ్లు లేని, తాగునీళ్లు లేని సిద్ధిపేట.. బంగారంలాంటి భూములున్నా పంటలు పండించుకోవడానికి నీళ్లులేని సిద్ధిపేటను.. నేడు అత్యంత సుందరంగా తీర్చిదిద్దుకొన్నట్టు చెప్పారు.*

# చివరి శ్వాస దాకా మీ సేవలోనే

## సీఎం కేసీఆర్ ఆశీస్సులు, మీ దీవెనలు నా అదృష్టం

- ఈ ప్రేమకు చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే
- పురిటిగడ్డ రుణం తీర్చుకున్న కేసీఆర్
- కేసీఆర్‌కు కృతజ్ఞత సభలా ఈ సభ
- కాళేశ్వరంతో కోనసీమలా సిద్ధిపేట
- సిద్ధిపేట సభలో మంత్రి హరీశ్‌రావు

సిద్ధిపేట, అక్టోబర్ 17 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'నా శ్వాస ఉన్నంత కాలం.. ఈ జన్మ ఉన్నంత కాలం.. సీఎం కేసీఆర్‌కు, ప్రజలకు నా జీవితాన్ని అంకితం చేస్తా' అని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులు, ప్రజల దీవెనలతో సిద్ధిపేటకు సేవ చేసే అదృష్టం దొరికిందని చెప్పారు. మంగళవారం సిద్ధిపేట ప్రజాశీర్వాద సభలో హరీశ్ మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు తన మీద చూపిన ప్రేమ, అభిమానాలకు చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువేనని అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్ సిద్ధిపేట సభకు వచ్చినప్పుడు.. 'మీరు హరీశ్‌ను ఆశీర్వదించండి. సిద్ధిపేట జిల్లా, రైలు, గోదావరి జలాలు ఇస్తాం' అని కేసీఆర్ మాట ఇచ్చి, నెరవేర్చి మళ్లీ మన ముందుకు వచ్చారని తెలిపారు. తెలంగాణను సాధించటమే కాదు.. మన సిద్ధిపేట ప్రజల కలలను సాకారం చేసి, ఈ పురిటి గడ్డ రుణం తీర్చుకున్న సిద్ధిపేట మట్టి బిడ్డ మన కేసీఆర్ అని కొనియాడారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ 'ఇది ఎన్నికల ప్రచార సభలా లేదు. మన కలలను సాకారం చేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేసే సభలా ఉన్నది. సీఎం కేసీఆర్‌కు మరింత శక్తినిచ్చి, దీవెనలిచ్చి, మరింత ఊపునిచ్చే సభలా ఉన్నది. మన సిద్ధిపేటకు ట్యాగ్‌లైన్ ఉండేది. నాటి నినాదాలు సిద్ధిపేట జిల్లా, నీళ్లు, రైలు ఇవి దశాబ్దాల కలలు.. ఎన్నికల నినాదాలు.. గోడ మీద రాతలుగా ఉండేవి. ఈరోజు రైలు, నీళ్లు, జిల్లాను అందించిన మన నాయకుడు కేసీఆర్. కేసీఆర్‌ను కారణజన్ముడు అంటారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఒక సారి మన సీఎం కేసీఆర్‌ను కలిసినప్పుడు.. కొంత మంది కలకంటారు. ఆ కలను నిజం చేసే అదృష్టం కొంత మందికే దక్కుతుంది. మీరు తెలంగాణ రావాలని స్పష్టించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. సాధించిన తెలంగాణను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దే అవకాశం మీకే దక్కింది. అదృష్టవంతులు అని అన్నారు. ఆనాడు ఎమ్మెల్యేగా అప్పటి సీఎం ఎన్టీఆర్‌కు సిద్ధిపేట అంబేద్కర్ విగ్రహం వద్ద దరఖాస్తు ఇచ్చిన చేతులతోనే, నేడు జిల్లాను ఏర్పాటు చేశారు కేసీఆర్. ఇంత కంటే అదృష్టం ఇంకోటి ఉంటుందా? అందుకే ఆయన కారణజన్ముడు' అని అన్నారు.

**నాడు రూ.4 లక్షలు.. నేడు కోటి**

'ఒకనాడు మన ప్రాంతంలో రైతులు భూములు అమ్ముకుంటే ఎకరానికి 4 లక్షలు, 5 లక్షలు ఉండే. ఇవ్వాళ సిద్ధిపేటలో ఎక్కడపోయిన 50 లక్షలు, కోటి రూపాయలకు ఎకరం అయ్యింది. సీఎం రైతుల గౌరవాన్ని పెంచారు. కేసీఆర్ వల్లే రైతులకు ధైర్యం వచ్చింది' అని హరీశ్ కొనియాడారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన చేసినప్పుడు తాను నీళ్ల మంత్రిగా పనిచేశానని మంత్రి హరీశ్‌రావు అన్నారు. చాలామంది ప్రతిపక్ష నేతలు తాము బతికుండగా నీళ్లను చూస్తామా? అని హేళన చేశారని గుర్తుచేశారు. కానీ చరిత్ర తిరగరాసిన్రు. మూడేండ్ల లోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని అన్నారు. నాడు కైకిలు దొరుకుతలేదు బిడ్డా అని అడిగేవాళ్లని, కేసీఆర్ దయ వల్ల ఇయ్యాళ గుట్టలు, రాళ్లు కూడా అచ్చు కట్టినమని, కైకిలోల్లు దొరుకుతలేరని వెల్లడించారు. 'ఎక్కడో ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన మగ కూలీలు ఎకరానికి రూ.5 వేలు గుత్తపట్టి నాట్లు వేస్తరని కలగన్నమా? ఒకనాడు గంజి కేంద్రాలు, అంబలి కేంద్రాలు, కరువు కాటకాలతో ఇబ్బంది పడ్డ తెలంగాణను ఇయ్యాల పది రాష్ట్రాలకు అన్నం పెట్టే ధాన్యాగారంగా మలిచిన ఘనత కేసీఆర్‌ది కాదా? దేశంలోనే అతి ఎక్కువ వరి ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దింది నిజం కాదా? పదేండ్ల కిందట ఇదే మన సిద్ధిపేటలో మనుషులకు తిండిగింజలకు తిప్పలు ఉండే. పశువులకు పశుగ్రాసం లేని పరిస్థితి కూడా చూశాం. నాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా చిన్నకోడూరు మండలంలో చింత చెట్ల కింద పశుగ్రాసం కేంద్రం పెట్టి పశువులకు గడ్డి తెచ్చి పశువులను బతికించుకున్నం. రాఘవాపూర్ స్టేజీ మీద, నంగునూరు మండలం రాజగోపాల్‌పేటలో పశుగ్రాస కేంద్రాలు పెట్టి మూగజీవాలను కాపాడుకున్నం. ఇవ్వాళ ఎక్కడ చూసినా పచ్చని పొలాలతో కోనసీమను తలపించేటట్టు తెలంగాణను, సిద్ధిపేటను తీర్చిదిద్దింది నిజం కాదా?' అని అన్నారు.

> కాంగ్రెసోళ్లకు 11 సార్లు చాన్స్ ఇచ్చినం
>
> *కాంగ్రెసోళ్లు ఒక్క చాన్స్ అని అడుగుతున్నారని, కానీ 11 సార్లు చాన్స్ ఇచ్చినా తాగడానికి నీళ్లు ఇవ్వడం చేతకానీ పార్టీ కాంగ్రెస్ అని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 11 సార్లు చాన్స్ ఇచ్చినా వాళ్లు చేయలేని పనిని, తొమ్మిదేండ్లలోపే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి చూపారు సీఎం కేసీఆర్ అని అన్నారు. 'రాజగోపాల్‌పేట పెద్ద చెరువు నిండితే సగం సిద్ధిపేట సల్లగా ఉంటుందని అనేవాళ్లు. 30 ఏండ్లకు ఒక్కసారి నిండని రాజగోపాల్‌పేట చెరువు నేడు నిండుకుండలా ఉన్నది. కేసీఆర్ నాయకత్వంలో చెరువులు ఎండంగ చూడం. సిద్ధిపేట డిక్షనరీలో కరువు అనే పదాన్ని శాశ్వతంగా తొలగించిన బిడ్డ మన కేసీఆర్' అని చెప్పారు.*

### రేవంత్ చరిత్రంతా సూట్‌కేసులు మోసుడే: దేశపతి

సిద్ధిపేట పేరును ఆకాశమంత ఎత్తున నిలిపిన వ్యక్తి సీఎం కేసీఆర్.. చరిత్రను ప్రభావితం చేసిన నాయకుడు సీఎం కేసీఆర్.. కేసీఆర్ వ్యూహం శత్రువులకు అందనిదని కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. సిద్ధిపేట ప్రజాశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ రేవంతప్పా.. రాజకీయమంటే బ్రీఫ్‌కేసులు మోసినంత ఈజీ కాదని వ్యంగ్యంగా రేవంత్‌రెడ్డిపై సెటైర్ వేశారు. 'హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్దకు పోయి డబ్బులు, మందు పంచకుండా ఎన్నికల్లో గెలువాలని కేటీఆర్‌కు సవాల్ విసరడం కాదు. కర్ణాటకలో కోట్ల రూపాయలు ఎట్లా దొరుకుతున్నాయి? ముందు దాని గురించి మట్లాడు' అని సవాల్ విసిరారు. ఉద్యమకారులపై రైఫిల్ ఎక్కుపెట్టిన, వలస పాలకులకు వంత పాడిన చరిత్ర రేవంత్‌ది అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'టికెట్లు అమ్ముకున్న చరిత్ర రేవంత్‌రెడ్డిది. ప్రజల కోసం పదవులను పదుల సార్లు త్యాగం చేసిన చరిత్ర కేసీఆర్‌ది' అని తెలిపారు.

# సిరిసిల్ల, సిద్ధిపేట సభలు గ్రాండ్ సక్సెస్

- రెండు నియోజకవర్గాల్లో అంచనాకు మించి హాజరైన ప్రజలు
- కేసీఆర్ ప్రసంగిస్తున్నంతసేపు చప్పట్లే

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమానికి, బంగారు తెలంగాణ నిర్మాణానికి పురిటిగడ్డ సిద్ధిపేట. సంక్షుభిత తెలంగాణకు, కల్లోల గీతాలకు చరమగీతం పాడి 'ఉరి'సిల్ల నుంచి సిరులఖిల్లాగా మారింది సిరిసిల్ల. రాష్ట్రంలో ఈ రెండూ వేటికవే పోటీ. అభివృద్ధి, సంక్షేమరంగాల్లో జోడెద్దుల పరుగు. అటు హరీశ్‌రావు, ఇటు కేటీఆర్ కృష్ణార్జునులై ప్రగతిదారుల్లో ప్రజాసైన్యాన్ని గెలిపించే గులాబీ సేనాధిపతులు. ఈ రెండు నియోజకవర్గాలంటే గులాబీ దళపతి, సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానం. అవి తనయుడు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు మాత్రమే కాదు.. తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక గత వైభవదీప్తులు. కేసీఆర్‌తో పెనవేసుకున్న పేగుబంధపు కూడళ్లు. ఈ రెండు నియోజకవర్గాల్లో మంగళవారం బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలు రాష్ట్రంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేయటాన్ని ఏ శక్తీ ఆపలేదని నిరూపించాయి.

**గులాబీల జనజాతర**

సిద్ధిపేటలో సీఎం కేసీఆర్ 'నియోజకవర్గ ఉళ్లల్లో ఎవరైనా ఉన్నరా? మొత్తం ఇక్కడే ఉన్నరా?' అని సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు. ఇంటికి తాళం పెట్టి 'ఇంటింటి రాజులు వచ్చినట్టే' పిల్లాపాపలతో జనం తరలివచ్చారు. తమ ఊళ్ల పేర్లను, తన సన్నిహితులు, స్నేహితుల పేర్లను సీఎం కేసీఆర్ ఉదహరిస్తున్నప్పుడు ఆయా గ్రామాల నుంచి వచ్చిన వారు ఈలలు, కేరింతలతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'మా నవాబ్‌సాబ్.. తోరణాల చంద్రారెడ్డి బావ' అని కేసీఆర్ సంబోధించటంతో సిద్ధిపేట ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణం అంతా పులకించిపోయింది. రెండు సభల్లోనూ కేసీఆర్ ప్రసంగానికి జనం ఉర్రూతలూగారు. సిరిసిల్లలో ప్రసంగిస్తూ 40 ఏండ్ల క్రితం తాను ఈతకొట్టిన కాలువలు, చెరువులు, మిడ్‌మానేరు నుంచి సజీవ జలధారలను గుర్తుచేసుకుంటూనే, నేతన్నల ఆత్మహత్యలు, నాటి జిల్లా అధికారులు గోడల మీద రాసిన రాతలు, వాటిని చూసి చలించిన సందర్భాలను కేసీఆర్ గుర్తుచేస్తున్నంతసేపు సభా ప్రాంగణం సైలెంట్ అయిపోయింది. సిద్ధిపేటలో 'రక్తం.. మాంసం.. బుద్ధి.. అన్నీ ఇచ్చి నన్ను కనీపెంచిన సిద్ధిపేట మాతృభూమికి, కన్నతల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసీ' అని సీఎం కేసీఆర్ చెప్తున్నప్పుడు ఆయన కంఠం కృతజ్ఞతాజేగంట మోగించింది. 'నేను చిన్నపిల్లగానిగా ఉన్నపుడు అమ్మ ఆరోగ్యం దెబ్బతింటే మా ఊర్లో ఒక ముదిరాజ్ తల్లి కూడా నాకు చనుబాలు ఇచ్చి సాదింది' అని కేసీఆర్ సిద్ధిపేట ఇంటింటితో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. 'దేశానికి తెలంగాణ తలమానికం అయితే.. తెలంగాణకు సిద్ధిపేట తలమానికం' అని కేసీఆర్ చెప్తుంటే సభాప్రాంగణం చప్పట్లు, ఈలలు, కేరింతలతో మార్మోగింది.